౫౮

# పాముల సీతయ్య ప్రస్థానం

అంగర వెంకటకృష్ణారావు

కర్ణఫులీనది ఒయ్యారంగా వంపు తిరిగిన చోటును ఆనుకొని, ముచ్చటగా మూడు వందల యిళ్లతో మురిసే పాటిజారీ గ్రామంలో, గ్రామీయుల ముఖాలన్నీ ఆవేళ చిన్నబోయి వున్నాయి. సాయంకాలపు నీరెండలో కర్ణఫులి కొత్త రూపాయలవలె మిలమిల మెరసే కన్నీళ్లు కారుస్తోంది.

కారణం, ఆవూరికి క్రొత్తగా కాపురానికి వచ్చిన ఒక కాపు పడుచు పాముకరిచి చనిపోయింది. ఏక కుటుంబంలాగున్న పల్లెవాసులందరూ, కరణం మొదలు కాటికావలికూ, యీ దుఃఖాన్ని సమానంగా పంచుకొన్నారు. గతించిన కాపు పడుచు శరీరం మట్టిలో కలిసిన గంటకే ప్రతి జీవిలో పుట్టిన సద్యోవైరాగ్యం సన్నగిల్లి, చీకటిలో నదీ జలాలలా, అజ్ఞాన తిమిరంలో ఐక్యమైపోయింది.

కాని ఒక్క మనిషిమాత్రం రాత్రి పది గంటలైనా యింకా యీ విషయాన్ని తనలో వితర్కించు కొంటున్నాడు. అతని పేరు సీతయ్య.

సీతయ్య, గౌరి హరిజన దంపతులు. వీళ్ల కుటీరం వూరికి కొంచెం దూరంగా, నదికి కొంచెం దగ్గరగా వుంది. సీతయ్య వూరికి బాలికకాడు, ఉద్యోగం చేయలేదు. అతడికి పిల్లలు లేరు. కరణంగారి ప్రపితామహులు తన ప్రపితామహులకి ఎప్పుడో తన యింటి వెనకని నదిని ఆనుకొని వున్న చిన్న మడిచెక్క దున్నుకోమని యిచ్చేరు. దానిమీద కూరలు కాపించి అవూళ్లో వాళ్లకే, ఖరీదుకని కాకుండా యిస్తూ, వాళ్ల దగ్గరనుంచి గూమాళ్లు పుచ్చుకొంటూ కాలుమీద కాలు వేసుకొని కాలక్షేపం చేస్తున్నాడు.

కరణం మొదలైన పెద్దలమీద సీతయ్యకి ఎంత భక్తివుందో వాళ్ళకి అతడిమీద అంత ప్రేమ వుంది.

కరణంగారి అబ్బాయి పెంకితనం చేస్తే కళ్లెఱ్ఱ చేసి గద్దిస్తాడు. కరణంగారికి కాలు బెణికితే దూరంనుంచే మంత్రిస్తాడు మాయమైపోయేలా.

అయితే సీతయ్యదగ్గర మరొక విద్య వుంది. అందరికీ ఎఱ్ఱచీమలు, చలిచీమలు అంటే ఎలాగో అతడికి పాములంటే అలాగ. అతడి యింట్లో పాములు కోడిపిల్లలలా తిరుగుతుంటాయి. అతడు వాటితో ఆడుకొంటాడు. వాటిని చిరుబూతులు తిడుతూ ముద్దు పెట్టుకొంటాడు.

అతడు మంత్రించడం మహా తమాషాగా వుంటుంది. కాటు తిన్న మనిషివద్దకు వచ్చి 'ఓస్! లెగవయ్యా, మా గొప్పోడివి'' అంటాడు నవ్వుతూ. యముడిని విఫల మనోరథుడిని చేసి లేచి తీరాలి ఆ మనిషి.

కొత్తపాముని పట్టడానికి కన్నంలో భుజం వఱకూ చేయి దూర్చి మహాకోపంతో, రౌద్రాకారంతో, అల్లల్లాడుతూ బుస్సలుకొట్టే నాగన్నని సిలువునా పైకిలాగినప్పుడా దృశ్యం చూసి తీరాలి. అతడి శరీరంనిండా లెక్కలేనన్ని పాముకాట్లున్నాయి. అతడి రక్తమే పాము విషానికి విరుగుడేమో. అంత సీతయ్యా ఆ రోజున కాపు పడుచును బ్రతికించలేకపోయాడు. అదే అతనికి ఆరని ఉక్రోషం; తీరని సమస్య.

పదిరోజులు గడిచాయి. తన పరాజయాన్ని సీతయ్య కొంచెం మరచిపోతున్నాడు. ఇంతలో మళ్ళీ వూరికి బయటనున్న ఆ మైదానంమీదే కరణంగారి పదేండ్లకొడుకుని కాటేసింది పాము. సీతయ్యకి కబురొచ్చింది. కన్నీళ్లతో కరణంగారొచ్చి సీతయ్యని తాకి రెండుచేతులూ పట్టుకొని తన ఒక్కగాని ఒక్కకొడుకుని బ్రతికించవలసిందని ప్రార్థించారు.

“నీపేర్నే పిలుచుకొంటాం సీతయ్యా వాణ్ణి” అంటే, సీతయ్య నిర్భయంగా నవ్వుతూ ధీమా

యిచ్చాడు. సంతానంలేని యీ దైవేచ్ఛ సీతయ్యకు పేగుబంధం తెలీకపోయినా, ఆత్మ విశ్వాసం ఎక్కువ కావడంచేత చలించలేదు.

అతడు మంత్రం ప్రారంభించి ఎనిమిదిగంటల నుంచీ విశ్వప్రయత్నం చేస్తూంటే సూర్యుడు నడి నెత్తిమీద సూదులు గ్రుచ్చుతూన్నా పిల్లవాడు కదలలేదు, మెదలలేదు.

సీతయ్యకి రానురాను ధైర్యం తగ్గిపోయింది. సాయంత్రం నాలుగుగంటలకు కుర్రవాడు మరణించాడు. ఊరల్లా వలవల ఏడ్చింది. కరణం గారి దుఃఖం వర్ణింపరానిది.

ఈ పరాజయానికి సీతయ్య తట్టుకో లేకపోయాడు. ఇద్దరిని పొట్టపెట్టుకొని తనకీర్తికి మాయనిమచ్చ ఆపాదించిన ఆ పామును పట్టి తీరవలసిందే అని నిశ్చయించాడు. అసలు పగకు పాము మిక్కిలి ప్రసిద్ధి. పాముకన్నా ఎక్కువ పగగలవాడు సీతయ్య. గౌరి ఎంత బ్రతిమాలినా కూడు తినలేదు. అతనికి నిద్రపట్టలేదు. కూర్చొని, లేచి, ఇటుఅటు ఒత్తిగిలి, పాము బుస్సవలె దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు. గౌరి చాలా విసుక్కుంది.

మనసు ఉండబట్టకసుమారు పదకొండుగంటల రాత్రికి గౌరి వారిస్తున్నా వినకుండా తలుపు తెరచుకొని సీతయ్య తిన్నగా మైదానందగ్గరకు వెళ్లేడు.

శుక్ల చతుర్దశినాటి కరిగిన వెండిలాంటి తళుకు వెన్నెలలో మెరిసే ఆకు పచ్చమైదానం మీద నిశ్శబ్ద రాత్రీ దేవతను ఆరాధిస్తున్న నాగ రాజును కళ్లార చూశాడు. చుట్ట పీల్చేసరికి ఎర్రగా వెలిగిన వెలుగు, మెల్లగా అతడు దగ్గిన దగ్గు నాగన్నని ఆకర్షించాయి. ఇది సమయం కాదని సీతయ్య ఇంటిముఖం పట్టాడు. ఇది కాలం కాదని నాగరాజు పుట్ట ముఖం పట్టాడు.

మిగిలిన రాత్రంతా సీతయ్య కలవరిస్తూ కలత నిద్రతో పుచ్చాడు. తొలికోడి కూయగానే పిల్లిలా లేచినప్పటికి "ఎక్కడికిరా మావా" అంటూ గౌరికూడా లేచింది. "గౌరీ, నీ కివాళ గొప్ప బహుమానం తెస్తాను" అన్నాడు వేడుకగా నవ్వుతూ సీతయ్య.

"మావా-యివాళ నువ్వు బయటకి వెళ్లొద్దు, నాకు మనస్సులో పెద్ద బాధగా వుంది" అని గౌరి అంటూంటే నోట్లో చుట్టకి నిప్పంటిస్తూ వెంకినవ్వు నవ్వేడు సీతయ్య, గౌరివెంపు ఓరగా చూస్తూ.

పంచ కట్టుకొన్నాడు. పొడుగు చేతుల చొక్కా తొడుగుకొన్నాడు. నాగులచవితికి కరణంగారు బహూకరించిన పెద్ద నాగులు గావంచా తలకి చుట్టేడు. గౌరి ఎంత వారించినా వినకుండా మైదానం చేరుకొన్నాడు.

మైదానానికి తూర్పు వైపున స్వర్ణపురిని ట్రంకురోడ్డుతో కలిపే రోడ్డు వుంది. మిగిలిన మూడుదిక్కులా ముండ్లకంచెల ఆవరణ వుంది. పడమటివెంపు ఎప్పుడూ నీరు చేరివుంటుంది. ఆ నీటికి ఆవరణకి మధ్యను ఎక్కడనో కాపుర ముంటున్నాడు నాగరాజు. సీతయ్య మైదానం చేరుకొనేసరికి మైదానం మధ్య భాగంలో నాగన్న వున్నాడు.

చంద్రాస్తమయం అప్పుడే అయింది. సూర్యుడి సప్తాశ్వాలు కక్కుతూన్న డిండీర కాంతికి ఆకాశం మెరుస్తూన్నది. ప్రకృతి ప్రశాంతంగా, రమణీయంగా వుంది. చల్లని రివట గాలి ఏటిమీంచి వచ్చి హాయి హాయి మని వీస్తూంది.

నాగరాజు యీ ప్రకృతి రామణీయకతలో తన్మయంచెంది పడగవిప్పి రెండడుగుల యెత్తు లేచి నిశ్చలంగా యోగివలె వున్నాడు.

పామును చూసి సీతయ్య మొట్టమొదట ముక్కుమీద వేలేసుకొని ఒక నిట్టూర్పు విడిచాడు. అది మహానాగం. దాని బుస, యమ ధర్మరాజు మహిషపు బుస. దాని దృష్టి లోకాంతరం నుండి పిలుపు. దాని కాటుకు తిరుగులేదు.

సీతయ్య తల పంకించాడు. మళ్లీ నిట్టూర్పు విడిచాడు. ఆవరణచుట్టూ తిరిగి పాముకు వెనుక వెంపునుండి వచ్చి రెండుగజాల దూరంలో ఊపిరి బిగపట్టి అరనిమిషం నిల్చొని ఆలోచించాడు. నెమ్మదిగా అడుగులో అడుగువేసి నడిచి వెళ్ళి దాని కంఠభాగాన్ని కుడిచేత్తో, నడుమును ఎడమచేత్తో గట్టిగా అదిమి పట్టుకొంటే అంత నాగరాజూ మేకపిల్లలా అణిగిపోయి మణిగి

కూర్చొన్నాడు. సీతయ్య సగర్వంగా ఠీవిగా దాన్ని తీసి తన నాగులు గావంచా మడతల్లో పెట్టి యథాప్రకారంగా ఆ గావంచా తలకి చుట్టుకొన్నాడు.

మైదానం విడిచి అతడు రోడ్డెక్కేసరికి యేటివద్ద కాలకృత్యాలు తీర్చుకొని వస్తూన్న కరణంగారు ఎదురై సీతయ్య దండం పెడితే పలకరించారు. పామును పట్టిన సంగతి విని ఆశ్చర్యపోయి ఎక్కడుందని ప్రశ్నించారు. అతడు పాగావైపు చూపెట్టగానే లోపలనుండి నాగన్న వున్నాను సుమీ అన్నట్టు బుస్సుమంది.

కరణంగారి గుండె జల్లుమంది. "సీతయ్యా, ఏమిటి నీ ధైర్యం? ఒక కర్ర లేదు, కంప లేదు, తోడైనా ఎవరూ లేరు. పైగా ఆ మృత్యుదేవతని తలమీద ధరించేవు. నీవు మనిషివేనా లేక సాక్షాత్తు సుబ్రహ్మణ్యస్వామివా! ఈ పని నిన్న జరిగివుంటే నా కొడుకు" అని కంట నీరు పెట్టుకొని కరణంగారు వెళ్ళిపోయారు.

సీతయ్య తలుపు తట్టేసరికి గౌరి ముఖం చిట్లించుకొంటూ వచ్చి "దొరికిందిరా మామా పాము?" అని ఎగతాళిగా నవ్వింది. వెటకారానికి సీతయ్య లేదన్నట్టు బుర్ర వూపేడు. గౌరి పాగా లాగబోయి గావంచా పట్టుకొనేసరికి నాగన్న బుస్ మంది. ఆఖరి కోడి కొక్కొరోకో మని కూసింది.

గౌరి నానాతిట్లూ తిట్టింది. ఇల్లెక్కి గెంతింది. కాని సీతయ్య నవ్వుతూ నేలని చతికిలబడి గంజి పట్టుకున్నాడు. పాగాతీసి జాగ్రత్తగా ప్రక్కన పెట్టి, ఉల్లిపాయ నంచుకొంటూ గంజితాగుతూ గౌరితో కబుర్లు చెబుతున్నాడు సీతయ్య. అతడన్న మాటలన్నిటికీ అపార్థంగా వింటూ తిడుతూ తనపని చేసుకొంటూ గౌరి అతడివైపు చూడడమే లేదు.

ఈలోగా నాగన్న చడిచప్పుడు లేకుండా, గావంచాలోంచి బయటికి వచ్చి సీతయ్య వెను కనుచేరి ఒక్కసారి నడికొప్పంత ఎత్తెగిరి సింహపు పంజా దెబ్బవలె సీతయ్య వెంట్రుకలులేని నడి నెత్తిమీద కస్ అని కాటు వేసింది. తను కదల కుండా తాడులా పడిపోయింది.

"తీర్చుకొన్నావురా పగ" అని సీతయ్య అరచాడు. బయటనున్న గౌరి గాభరాగా వచ్చింది. సీతయ్య మంత్ర ప్రయోగం చేసు కొన్నాడు. కాని స్పృహ తప్పిపోతూంది. గౌరి పామును తిట్టింది. సీతయ్యను తిట్టింది. తనను మరీ తిట్టుకొంది.

సీతయ్యదగ్గర ఒక మణి వుంది. అది అమూల్యమైనది. అమణి తీయమన్నాడని సంజ్ఞ చేశాడు. కుటీరమల్లా వెతికింది, ప్రతీసామానూ తీసి చూసింది. ఆ వెర్రిలో వస్తువులను చిందరవందర చేసి అలసి పోయి చెమటపోసి నెత్తిమీద రెండు చేతులూ పెట్టుకొని బావురుమని ఏడవసాగింది. మణి దొరికి వుంటే సీతయ్య బ్రతికేవాడు.

మరొక్క అరగంటకల్లా గ్రామవాసు లందరూ సీతయ్య కుటీరం చుట్టూ మూగారు. పాము లాంటి సీతయ్యను, సీతయ్యలాంటి పామునూ చూసి ఆశ్చర్యపోయారు.

కొందరు చివరకు పగ సాధించాడురా సీతయ్య అనుకొన్నారు. మరికొందరు చివరకు పగ సాధించాడురా నాగన్న అనుకొన్నారు. నిజంగా ఎవరు సాధించారో పగ?

ఒకమాటు ఒక సినీమా తారా, ఒక కవీశ్వరుడూ కలిసి కాఫీ తాగుతున్నారు. ఆ సినీమా తారకి వల్లమాలిన గర్వం, మధ్యలో అనుమానం వచ్చి ఆమె కవిని యిలా అడిగింది: "నా సినీమా రోజులు అయిపోయాక, నన్ను ప్రేక్షకలోకం అభిమానిస్తుం దంటారా?"

"ఇంకా అనుమాన మేమిటి" అని టక్కున సమాధాన మిచ్చాడు కవి.